క్లుప్తంగా

హెల్త్ ఆఫీసర్‌ను నియమించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరపాలక సంస్థలో గత నెల రోజులుగా హెల్త్ ఆఫీసర్ లేకపోవడంతో పారిశుద్ధ్య పనులు కుంటుపడుతున్నాయని, జనన మరణ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు కష్టాలు పడుతున్నారని, తక్షణమే హెల్త్ ఆఫీసర్ ను నియమించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా కోరారు. మంగళవారం స్థానిక హోచిమిన్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలువల్లోని మురుగు, వీధుల్లోని అపరిశుభ్రత కారణంగా దోమల బెడద రోజురోజుకు తీవ్రమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరం ఒకటో డివిజన్ పాత కడప హరిజనవాడలో చిన్న చిన్న కాలువలన్నీ కలిపి వెళ్ళే ప్రధాన డ్రైనేజీ కాలువను తక్షణమే ఏర్పాటు చేయాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం కడప నగరంలోని పాత కడప హరిజనవాడలో సిపిఎం నేతలు, ప్రజా సంఘాల నాయకులు కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ పాత కడప హరిజనవాడ ఏర్పడి దాదాపు 40 సంవత్సరాలైందని, ఇప్పటివరకు ప్రధాన కాలువ ఏర్పాటు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, పార్టీ నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, కేవీపీఎస్ నగర కన్వీనర్ దాసరి నరసింహ, గోవిందు, పిఎన్ఎం నగర కార్యదర్శి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి జాతీయ సమావేశాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు కడప నగరం హరిత హోటల్‌లో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలను నిర్వహించనున్నామని, వీటిని జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కడపలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాలు కడప నగరంలో తొలిసారిగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశాలకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. మొదటిరోజు కడప ఆర్టీసీ బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ జాతీయ కౌన్సిల్ సమావేశంలో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి, వ్యవసాయ సీఐటీయూ నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, కెవిపిఎస్ నగర కన్వీనర్ నరసింహ, నాయకులు గోవిందు, ప్రజానాట్యమండలి నగర కన్వీనర్ రమణ పాల్గొన్నారు.

7న ఆలయం మూసివేత

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గమ్మ ఆలయాన్ని ఈనెల 7వ తేదీ గ్రహణం కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆలయం మూసి వేస్తారని ఆలయ నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామున నవకలశ స్నపనం, 10 గంటలకు చండీ హోమం నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆలయం మూసివేసి 8 వ తేదీ ఉదయం 6గంటలకు ఆలయ శుద్ధి తర్వాత 9 గంటల నుంచి అమ్మవారి దర్శనం ఉంటుందని ఆయన వివరించారు.

ముఖ్యమంత్రితో ఫొటోలకే రజకులు పరిమితమా...!

కడప కార్పొరేషన్: మొన్న రాజంపేట నియోజకవర్గ పరిధిలోని బోయిన పల్లి పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు నాయుడు ఫొటోలకే రజకులను పరిమితం చేశారని రాష్ట్ర టూరిజం బోర్డు మాజీ డైరెక్టర్, రజక సంఘ నేత లోగిడి జయన్న అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బోయినపల్లెలో రజక వృత్తిదారులతో సీఎం మాట్లాడారని, వారి నిజ జీవితాలను, రజక వృత్తిలో అనేక ఏళ్లుగా వారు పడుతున్న కష్టాలను, ఇబ్బందులను కళ్లారా చూసినా సీఎం మనసు చలించలేదన్నారు. రజకుల అభివృద్ధికి కేవ లం వాగ్దానాలు ప్రకటిస్తూ, కంటి తుడుపు చర్యలతోనే కాలం వెళ్ళదీస్తున్నారని, 4 దశాబ్దాలుగా ఇదే అనవాయితీ కొనసాగుతోందన్నారు.

ప్రతి మనిషి బీమా చేయించుకోవాలి

కడప ఎడ్యుకేషన్: నేటి స్పీడు యుగంలో ప్రతి మనిషి తప్పకుండా బీమా చేయించుకోవాలని ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి శంకర్ అన్నారు. కడప ఐ ఎమ్ ఏ హాల్ లో మంగళవారం ఉదయం శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్సు 50 సంవత్సరాల స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన సెన్సేషనల్ సెప్టెంబర్ 2025 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్సు సి ఇ ఓ రమేష్ , డి జి ఎమ్ మునిరత్నం నాయుడు , ఆర్ ఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

జనహృదయ నేతకు మహా నివాళి



పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్: దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. మంగళవారం హెడ్‌పోస్టాఫీసు సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, బీహెచ్ ఇలియాస్, యానాదయ్య, పులి సునీల్, బంగారు నాగయ్య, నాగేంద్రారెడ్డి, సీహెచ్ వినోద్, షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పార్టీ కార్యాలయంలో...

వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఇక్కడి జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ఆర్ ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆరోగ్యశ్రీ, 108, 104, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం, పావలావడ్డీ రుణాలు, ఉచిత కరెంటు వంటి సంక్షేమ పథకాలతో పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పులి సునీల్, నాగార్జునరెడ్డి, బాలస్వామిరెడ్డి, త్యాగరాజు, వేణుగోపాల్ నాయక్, జాషువా, ఏ1 నాగరాజు, పవర్ అల్తాఫ్, జమాల్‌వలీ, కంచుపాటి బాబు, వస్తం అంజి, సుబ్బారెడ్డి, మల్లికార్జున, బండి ప్రసాద్, క్రిష్ణవేణి, బి. మరియలు, తులశమ్మ పాల్గొన్నారు.

- వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గల్ఫ్ కన్వీనర్, కడప నార్త్ జోన్ అధ్యక్షులు బీహెచ్ ఇలియాస్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ పక్కన ఉన్న ప్రేమాలయం నిరాశ్రయుల వసతి గృహంలో అల్పాహారం పంపిణీ చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేధావుల ఫోరం అధికార ప్రతినిధి క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.
- వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా అలకనంద ఉమెన్స్ వరల్డ్ నందు వైఎస్సార్‌సీపీ నగర ప్రధాన కార్యదర్శి పి. సంపత్‌కుమార్, అంగన్‌వాడీ నగర అధ్యక్షురాలు చైతన్య ఆధ్వర్యంలో 23, 28 డివిజన్ల పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులకు చీరెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి 28వ డివిజన్ కార్పొరేటర్ ఆరీఫుల్లా బాషా, 23వ డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి విచ్చేసి చీరెలు పంపిణీ చేశారు.
- వైయస్సార్‌సీపీ యువజన నాయకుడు రహీమ్ ఆధ్వర్యంలో పాతరిమ్స్‌లో ఉన్న ఆదరణ ఆశ్రమంలో అల్పాహారం పంపిణీ చేశారు. ఆలంఖాన్‌పల్లె సమీపంలోని ఇర్కాన్ సర్కిల్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి 50వ డివిజన్ ఇన్‌చార్జి పాలెంపల్లి రమణ, అశోక్‌రెడ్డి, బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. బాదుల్లా, శ్రీను, చెన్నారెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, అక్బర్, దాస్, జయరాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు.
- వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా 39వ డివిజన్‌లోని మాసీమ సర్కిల్‌లోఉన్న వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి మున్నా ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు.



ప్రేమాలయం నిరాశ్రయుల వసతి గృహంలో అల్పాహారం పంపిణీ చేస్తున్న బీహెచ్ ఇలియాస్



కార్మికులకు చీరెలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అరీఫుల్లా బాషా, సంపత్ కుమార్, చైతన్య

సొంత పార్టీ నుంచే ఇబ్బందులు

మంత్రి లోకేష్‌కు పరిస్థితులు వివరించిన అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి



లోకేష్‌తో మాట్లాడుతున్న లక్ష్మిరెడ్డి కుటుంబ సభ్యులు

కడప రూరల్ : వర్గ విభేదాల తెలుగుదేశం పార్టీలో ఒక వర్గానికి చెందిన జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు మంగళవారం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కలిశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. ఆయా అంశాలను విన్న లోకేష్ నేను మీతో మాట్లాడుతానని, సమన్వయంతో చూస్తానని, సహకారం ఉంటుందనీ వారికి చెప్పినట్లు తెలిసింది. లక్ష్మిరెడ్డితోపాటు ఆయన కుమారుడు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మన్మోహన్ రెడ్డి, కోడలు కార్పొరేటర్ ఉమాదేవిలు లోకేష్‌తో మాట్లాడారు. చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లె క్యాంప్ కార్యాలయం వద్ద వారు మంగళవారం లోకేష్‌ను కలిశారు. ఇదిలా ఉంటే నాలుగైదు రోజుల క్రితమే సీఎం చంద్ర బాబు నాయుడు కార్యాలయం నుంచి పిలుపు రావడంతో లక్ష్మిరెడ్డి, ఆయన కుమారుడు మన్మోహన్ రెడ్డిలు వెళ్లి లోకేష్‌ను కలిశారు. ఇంతకాలంగా తనకు కడప అసెంబ్లీలో ప్రాధాన్యం లేకుండా పోయిందని, సొంతపార్టీ నుంచే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే విషయాన్ని లక్ష్మిరెడ్డి, ఆయన కుటుంబసభ్యులు పార్టీ పెద్దలతో మొర పెట్టుకున్నట్లు సమాచారం. అసంతృప్తితో ఉన్న వారితో చంద్రబాబు మాట్లాడటం , లోకేష్ కూడా సానుకూలంగా మాట్లాడటంతో ఇప్పుడు కడప తెలుగుదేశం పార్టీలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. లక్ష్మి రెడ్డి కుటుంబానికి రాజకీయంగా ప్రాధాన్యం కల్పించే అవకాశాలు కూడా ఉన్నట్లు పలు వర్గాలు భావిస్తున్నాయి.

సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని మండల వనరుల కేంద్రంలో పనిచేసే ఎంఐఎస్ కోఆర్డినేటర్ల సమస్యలను పరిష్కరించాలని ఎంఐఎస్ జిల్లా అధ్యక్షుడు తిమ్మంపల్లి అరవిందు, సభ్యులు మహేశ్వరరెడ్డి, కవినాథ్, గుర్రప్పలు కోరారు. ఈ విషయమై మంగళవారం కడప జిల్లా పర్యటనకు విచ్చేసిన మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఉద్యోగ సేవలు క్రమబద్ధీకరణ చేయాలని వారు కోరారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

కడప ఎడ్యుకేషన్: డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ తమ పాత్ర పోషించాలని ఈగల్ అధికారులు కోరారు. కడప శంకరాపురంలోని శ్రీ శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు డ్రగ్స్, మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలపై జిల్లా నార్కోటిక్ సెల్, 'ఈగల్' బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ అధికారులు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 'ఈగల్' పేరుతో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిందన్నారు. మాదక ద్రవ్యాల చట్టాలు వాటిలోని కఠిన శిక్షల గురించి పిల్లలకు వివరించారు. డ్రగ్స్ వాడకం, అమ్మకాలు చట్ట ప్రకారం నేరమని తెలిపారు. ఎవరైనా మీ ఇల్లు లేదా పాఠశాల చుట్టుపక్కల డ్రగ్స్ అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 1972 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. . సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అలాగే సైబర్ నేరాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని లింక్‌లు క్లిక్ చేయవద్దని, అలాగే ఓటిపి, పాన్ కార్డ్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు డ్రగ్స్ నివారణలో భాగస్వాములు అవుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఇలియాస్ రెడ్డి, నార్కోటిక్ సెల్ నుంచి మల్లయ్య, ఈగల్ బృందం సభ్యులు అయూబ్ ఖాన్, గురు శేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈగల్ అధికారులు

పిల్లలు సత్ప్రవర్తనతో విద్యనభ్యసించాలి

కడప ఎడ్యుకేషన్: పిల్లలు సత్ప్రవర్తనతో విద్యనభ్యసించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి బాబా ప్రకృద్దీన్ సూచించారు. కడప ప్రకాస్‌నగర్‌లోని జీసస్ స్పెషల్ ఆర్గనైజేషన్ ఫర్ స్వీకర్ హోమ్స్‌ను మంగళవారం ఆయన విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన వంటశాలను, వసతి గదులను, తరగతి గదులను పరిశీలించారు. పిల్లలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా వారి బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవలు పథకం 2024) గురించి వివరించారు. పిల్లలు సత్ప్రవర్తనలతో విద్యనభ్యసించడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్య చాలా విలువైనదని క్రమశిక్షణతో అభ్యసించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే న్యాయ సేవ అధికార సంస్థ వారి దృష్టికి తీసుకుని రావచ్చన్నారు. కార్యక్రమంలో హోం నిర్వాహకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ప్రకృద్దీన్

ఏపీజీఎల్ఐ చెల్లింపుల్లో ఆలస్యం తగదు

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ జీవిత బీమా సంస్థ (ఎపిజిఎల్ఐ) పరిణతి బాండ్ల చెల్లింపులోనూ, లోన్ల చెల్లింపులో ఆలస్యం తగదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అన్నారు. ఈ విషయమై మంగళవారం ఏపీజీఎల్ఐ జిల్లా కార్యాలయంలో సహాయ సంచాలకులు రమేష్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ చాలా మంది ఉపాధ్యాయుల జీవిత బీమా పాలసీలు మెచ్యూర్ అయ్యాయని వాటిని డీడీవోలు ఆమోదించి ఏపీ జి ఎల్ ఐ కార్యాలయానికి పంపారని, అయితే ఏపీజీఎల్ఐ కార్యాలయంలో సుదీర్ఘ కాలంగా వాటిని పరిష్కరించకుండా ఉన్నారన్నారు. ఇలా నెలల తరబడి బిల్లులు పెండింగ్ లో ఉండడం వల్ల ఉపాధ్యాయులకు ఆర్థికంగా ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. వ్యక్తిగత, ఆరోగ్య అవసరాల నిమిత్తం లోన్లు పెట్టుకున్న ఉపాధ్యాయుల విషయంలోనూ ఆలస్యం జరుగుతోందన్నారు. మెచ్యూర్ అయిన బాండ్లు, లోన్లు త్వరితగతిన చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు రమేష్ బాబు మాట్లాడుతూ సిబ్బంది కొరత వలన ఆలస్యం అవుతున్న మాట వాస్తవమేనని, ఇకముందు ఆలస్యం కాకుండా త్వరితగతిన ఆమోదం పొందే విధంగా చర్యలు చేపడతామని, ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా చూసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కృష్ణారెడ్డి, నాయకులు గాజులపల్లి గోపీనాథ్, వై రామ కేశవ, బత్తుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఏపీజీఎల్ఐ సహాయ సంచాలకుడికి వినతి పత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

నేత్రదానంపై అవగాహన అవసరం

కడప అర్బన్: కడప రిమ్స్ మెడికల్ కళాశాలలో ఎల్వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఐ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలు పురస్కరించుకొని అవగాహనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున , జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ మాధవిలత, రిమ్స్ కాలేజి వైస్ ప్రిన్సిపాల్, ఆప్తమాలజీ హెచ్ఓడి జ్ఞాన ప్రసూన, ఎల్.వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ క్యాంపస్ హెడ్ డాక్టర్ కావ్య మాధురి, డాక్టర్ అనిరుధ్ హీరర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన రాయలసీమ రీజియన్ లో ముఖ్యంగా కార్నియా పొర దెబ్బ తినడం వలన అంధత్వం ఏర్పడుతుందన్నారు. దీని నివారణ కు కార్నియా పొరను ట్రాన్స్ ప్లాంటేషన్ అన్నది ఒకే ఒక్క మార్గం అన్నారు. ఈ పద్ధతి ద్వారా కంటి చూపు కోల్పోయిన వారికి చూపుమెరుగు పడుతుందన్నారు. అలాగే ప్రతి ఒక్కరు నేత్ర దానం చేయడానికి ప్రతిజ్ఞ చేయాలి అని పిలుపునిచ్చారు. ఎవరైనా సహజంగా గానీ ప్రమాద వశాత్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఐ బ్యాంక్‌కు సమాచారం ఇస్తే నేత్రాలను సురక్షిత పద్ధతుల్లో సేకరించి వాటిని భద్ర పరిచి అవసరం ఆయిన చూపు కోల్పోయిన వారికి ఉచితంగా అమర్చవచ్చన్నారు. ఈ నేపథ్యంలో అందరూ నేత్ర దానం పై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్వీఈఐ కాంపస్ అడ్మిన్ విజయ్ కుమార్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఐ బ్యాంక్ మేనేజర్ రెడ్డి బాబు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నేత్రదాన ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, వైద్యులు

సర్వకాలాల్లో సాయం చేసే ఆరోగ్యమాత



మరియమాత సందేశాన్ని అందిస్తున్న గురువులు

కడప సెవెన్‌రోడ్స్ : ఆరోగ్యమాత మనకు సర్వకాలాలలో సహాయం చేస్తుందని, ఆమె మనతో ఉంటే ఆరోగ్యంతోపాటు సిరి సంపదలకు లోటు ఉండదని సీఎంఎస్ఎస్ఎస్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ జి.మనోహర్ అన్నారు. ఆరోగ్యమాత నవదిన ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు మంగళవారం నగిరి విచారణ గురువు గుడిమె దేవసహాయం మరియమాత పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరియ తల్లి ఎల్లవేళలా మన గృహాలలో ఉండాలని, అన్ని పనులలో ఆదుకోవాలని, ప్రయాణంలో రక్షించాలని కోరుకోవాలన్నారు. ఆమె తోడుంటే ఐశ్వర్యంతోపాటు ఆరోగ్యం, గౌరవ మర్యాదలు అన్నీ సాధ్యమేనన్నారు. ఈ సందర్భంగా మరియమాత స్వరూపాన్ని అలంకరించిన పల్లకీలో ఉంచి విశ్వాసులు చర్చి ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ రెవ ఫాదర్ ఎండీ ప్రసాదరావు, భక్తులు, ఆరోగ్యమాత, జీఎంజీ, క్రీస్తు జ్యోతి సిస్టర్లు, చర్చి పెద్దలు, యూత్ కమిటీ సభ్యులు, మరియదళం, మౌలిక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో రాహుకాల పూజలు

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఐఏఎస్ సుబ్రహ్మణ్యంకు ఘన నివాళి



ఐఏఎస్ సుబ్రమణ్యం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కడప కార్పొరేషన్: హెలికాప్టర్ ప్రమాదంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి తోపాటు మరణించిన ఐఏఎస్ అధికారి సుబ్రహ్మణ్యం విగ్రహానికి ఇంటర్నేషనల్ దళిత్ జర్నలిస్ట్ నెట్‌వర్క్ నాయకుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐ డి జే ఎన్ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రానికి కలెక్టర్‌గా, కార్యదర్శిగా ఆయన చేసిన సేవలను గుర్తుకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు భవనాసి శివప్రసాద్, లోకేష్, ఇరగయ్య, చంద్ర ఓబులయ్య, న్యాయవాది శ్రీనివాసులు, గిరిజన అభివృద్ధి సంఘం నాయకులు సుధాకర్, శ్రావణ్, డాక్టర్ సిద్దు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ కాంప్లెక్స్‌లో స్వచ్ఛభారత్

కడప సెవెన్‌రోడ్స్ : బీమా వారోత్సవాలలో భాగంగా ఎల్ఐసీ ఉద్యోగులు స్థానిక డివిజనల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కల్ని, చెత్తా చెదారాన్ని తొలగించారు. అలాగే ఉద్యోగులకు స్థానిక ఎల్ఐసీ సభా భవనంలో క్విజ్ ప్రోగ్రాం నిర్వహించారు. కడప బాలికల హైస్కూలు విద్యార్థినులకు 78 ఏండ్ల స్వతంత్ర భారతం అనే అంశంపై ఎల్ఐసీ అధికారులు క్విజ్ నిర్వహించారు. మేనేజర్ సత్యప్రసాద్, మహేశ్వర్ రెడ్డి, కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, సరళ, శ్రీవాణి, రఘునాథ రెడ్డి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు మంజుల, ఆయేషా తస్లీం పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

వారోత్సవాల్లో భాగంగా ఎస్‌డీఎం రవికుమార్ ఉద్యోగులకు, విద్యార్థినులకు ఎల్ఐసీ సిబ్బంది బృందం మొక్కల పంపిణీ చేసి, మొక్కల పెంపకం ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ జేకేఆర్‌వీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



విలేకరులతో మాట్లాడుతున్న అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సర్వీసులను రెగ్యులరైజేషన్ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ (3045) వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్, జిల్లా అధ్యక్షులు సుబ్బరాయుడు కోరారు. మంగళవారం కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈక్వెల్ పే ఫర్...ఈక్వెల్ వర్క్ సూత్రాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. విద్యుత్ సంస్థలో కాంట్రాక్టు సిస్టమ్‌ను రద్దు చేసి పక్క రాష్ట్రాల మాదిరిగానే రెగ్యులరైజేషన్ చేయాలని కోరారు. అనంతరం ప్రతాప్, రమేష్, శివారెడ్డి, నరసింహా, రమణ, మహమ్మద్ రఫీ, చలపతి, స్వర్ణలత, నాగార్జున, సుబ్బారెడ్డి, రమేష్‌తో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు.

బీజేపీతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కు



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : దేశంలో బీజేపీతో ఎన్నికల కమిషన్ కుమ్మక్కు కావడం వల్ల ఓట్ల దొంగలు, పదవుల దొంగలు తయారయ్యారని కాంగ్రెస్‌పార్టీ ఆర్‌టీఐ చైర్మన్ ఓటపాటి లక్ష్మయ్య, నాయకులు జాకీర్, ఆసిఫ్,సత్తార్‌లు ఆరోపించారు. మంగళవారం ఈ అంశంపై కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఎన్నికల్లో ఓట్ల అవకతవకలు, ఈవీఎంలలో మోసాలు చేయడం వల్లే బీజేపీ అధికారంలోకి వస్తోందన్నారు. తప్పుల తడకగా ఉన్న ఓటరు లిస్టుల గురించి తమ అధినేత రాహుల్‌గాంధీ సాక్ష్యాధారాలతో సహా నిరూపించడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాహుల్‌గాంధీ సంధించిన ప్రశ్న లకు ఎన్నికల కమిషన్ సమాధానం ఇవ్వలేక పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధి వేదిక నాయకులు నారాయణ, హేతువాద సంఘం నాయకులు సీఆర్‌వీ ప్రసాద్, ఆర్ఎస్‌పీ నాయకుడు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం

సిద్ధవటం : సిద్ధవటం ఎగువపేట పత్తుమియ్య మసీద్ నందు మంగళవారం రాత్రి పకీరుల మేళతాళాలతో గంధం మహోత్సవాన్ని ముత్తవల్లి సయ్యద్ అబ్దుల్ అజీజ్ ఖాద్రి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. మహ్మద్ ప్రవక్త (స) జన్మదినాన్ని (మిలాద్ ఉన్ నబీ), హజరత్ దుర్వేష్ షా ఖాద్రి (రహ) ఉరుసు మహోత్సవం బుధవారం నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.